

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,51,629
బంగారం	180 మిల్లీ గ్రాములు
వెండి	112 గ్రాముల 650 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



వీడని వాన

జయపురం డివిజన్ పరిధిలో గత మూడు వారాలుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.

- 8లో



విరిగిపడిన కొండ చరియలు

మల్కన్‌గిరి జిల్లాలోని కోరుకొండ సమితి నక్క మామ్ముడి పంచాయతీ బయపోడ ఘాటీలో మరోసారి భారీ వర్షాలకు శనివారం కొండ చరియాలు విరిగిపడ్డాయి.

- 8లో

న్యూస్‌రీల్

బంగాళ దుంపల సరఫరా పునరుద్ధరణ

భువనేశ్వర్: రాష్ట్రంలో బంగాళ దుంపల సరఫరా పునరుద్ధరణ జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి మో హన్ చరణ్ మాఝి తెలిపారు. నీతి ఆయోగ్ సమావేశం పురస్కరించుకుని న్యూఢిల్లీలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీతో ఆయన శనివారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో బంగాళ దుంపల సంక్షోభానికి సంబంధించి ఆమెతో చర్చించారు. బంగాళ దుంపల రవాణాకు అడ్డుకట్ట వేయడంతో రాష్ట్రంలో ప్రజలు అధిక ధర బారినపడి అల్లాడి పోతున్నారు. చొరవ కల్పించుకుని ఈ పరిస్థితి సర్దుబాటు చేయాలని అభ్యర్థించినట్లు తెలిపారు. ఇంతకుముందు రాష్ట్ర విపక్ష నేత, బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ పశ్చిమ బెంగాలు ముఖ్యమంత్రి మమత బెనర్జీకి లేఖ రాసి ఈ మేరకు అభ్యర్థించిన విషయం తెలిసిందే. మొత్తం మీద పొరుగు రాష్ట్రం ముఖ్యమంత్రితో సంప్రదింపులు జయప్రదం కావడంతో పశ్చిమ బెంగాల్ నుంచి రాష్ట్రానికి బంగాళ దుంపల దిగుమతి పునరుద్ధరించబడింది. రాష్ట్రంలో క్రమంగా ఆలుగడ్డల ధర తగ్గుముఖం పడుతుందని వినియోగదారుల వర్గం ఆశిస్తుంది.

క్రీడాధికారుల కార్యవర్గ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న జిల్లా ముఖ్యవిద్యాధికారి మాయాధర్ సాహు

పర్లాకిమిడి: స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో గజపతి జిల్లాస్థాయిలో వాలీబాల్, అథ్లెటిక్ క్రీడల పోటీలను నిర్వహించేందుకు అన్ని ఉన్నత విద్యాలయాల పీఈటీలతో జిల్లా ముఖ్య విద్యాధికారి మాయాధర్ సాహు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రతీ ఉన్నత విద్యాలయంలో వాలీబాల్, లాంగ్‌జంప్, రన్నింగ్ తదితర ఆటల పోటీలు నిర్వహించాలని కోరారు. జిల్లా క్రీడాధికారుల కార్యవర్గ సభ్యుల కమిటీ సమావేశానికి ఖరడా (కాశీనగర్) ఉన్నత పాఠశాల నుంచి మానస కుమార్ రౌత్, మహేంద్రగిరి పురపాలక ఉన్నత పాఠశాల పీఈటీ పూర్ణచంద్ర ప్రధాన్, ఎంఆర్ బాయ్స్ హైస్కూల్ నుంచి హెచ్ఎం మనస్వినీ దాస్, గారబంద నుంచి సురేంద్ర కుమార్ పాత్రో, ఎస్వీటీ ఉన్నత పాఠశాల నుంచి బి.త్రినాథ రావు, ఎస్ఎం ఉన్నత పాఠశాల నుంచి మేనకారావు, రాయఘడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి మనోజ్ బెహరా, స్పోర్ట్స్ అధికారి సురేంద్ర కుమార్ పాత్రో తదితరులు హాజరయ్యారు.

మహిళల క్రికెట్ టీమ్ ప్రకటన



ఎంపికైన మహిళా క్రికెటర్ల టీమ్‌తో కోచ్‌లు

జయపురం: అంతర్ జిల్లా మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే కొరాపుట్ జిల్లా మహిళా క్రికెట్ టీమ్ సభ్యుల వివరాలను జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ శనివారం ప్రకటించింది. ఒడిశా క్రికెట్ అసోసియేషన్ ఆటగాళ్ల జాబితాను ఆమోదించిన అనంతరం పేర్లు ప్రకటించినట్లు ఒడిశా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అనూప్ కుమార్ పాత్రో వెల్లడించారు. ఈ టీమ్‌లో ప్రియాంక వర్మ(కెప్టెన్), వి.అస్త (వైస్ కెప్టెన్), ప్రియాంక్ ప్రియదర్శిణి పాత్రో, సాలు బొరాయి, సామరీ హంచారియ, నమ్రత వాడింగ్, అమ్రిత దేవుల పాడియ(వికెట్ కీపర్), జానకీ చలాన్, సంబల్ పారబిని, గంగా హంచారియ, కె.నిశ్చిత, సునీత ఖిలో, లిప్స నాయిక్, సంజీత ముదులి, మమితా బేక్రీలు ఉన్నట్లు తెలిపారు. టీమ్ మేనేజర్‌గా వై.ప్రసాద్ బాధ్యతలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో ఈనెల 29న డెంకానల్‌తో, 30న జాజ్‌పూర్‌తో, 31న ఖెంజూరు టీమ్‌తో కొరాపుట్ తలపడుతుందని రబి నాయిక్ తెలిపారు.

నాలుగు క్యాంపస్‌లలో 3396 ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని నాలుగు రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లలో మొదటి విడత ప్రవేశాలు పూర్తి చేసినట్లు అడ్మిషన్ల కన్వీనర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. ఎస్ఎంపురం ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. నాలుగు క్యాంపస్‌లో కౌన్సెలింగ్‌కు 4140 మంది విద్యార్థులను పిలవగా, 3396 మంది ప్రవేశాలు పొందారని తెలిపారు. శ్రీకాకుళంలో 1035 సీట్లకు 863, ఒంగోలులో 1035 కి 858, న్యూజివీడులో 1035కి 792, ఆర్కే వ్యాలీలో 1035కి 858 ప్రవేశాలు జరిగాయని అన్నారు. ఖాళీ సీట్లుకు రెండు విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అన్నారు.

• మహా దేవుడి దర్శనం



హిమాచల్‌ప్రదేశ్‌లోని 16,497 అడుగుల ఎత్తున ఉన్న శ్రీఖండ్ మహాదేవుడిని జయపురం యువకులు దర్శించారు. జయపురం డొంగరియ గ్రూపు యువకులు రఘునాథ్ స్త్రై, మనోజ్ సాహు దర్శించుకున్నారని ఆ గ్రూపు కో–ఆర్డినేటర్ రాజేష్ పాణిగ్రహి శనివారం వెల్లడించారు. నాలుగు రోజులు పర్వతారోహణ జరిపినట్లు పేర్కొన్నారు. వారు సాధించిన ఈ విజయంపై ఎంతో గర్వంగా ఉన్నామన్నారు.

– జయపురం

• విద్యుత్ షార్ట్ సర్క్యూట్

రాయగడ పట్టణంలో తరుచూ షార్ట్ సర్క్యూట్లు చోటుచేసుకుంటుండడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి రాణిగుడ ఫారంకు వెళ్లేమార్గంలో విద్యుత్ తీగల నుంచి మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో ఆ మార్గంలో నడిచేవారు భయంతో పరుగులు తీశారు.

– రాయగడ



• ఉత్తమ రాష్ట్రంగా ఒడిశా



క్షయ నివారణలో ఉత్తమ రాష్ట్రంగా ఒడిశా అవార్డు గెలుపొందింది. వరుసగా రెండోసారి రాష్ట్రం ఈ అవార్డు గెలుచుకుంది. రాంచీలో జరిగిన వైద్య కళాశాలల జోనల్ టాస్క్‌ఫోర్స్ సమావేశంలో క్షయ (టీబీ) నిర్మూలన కార్యకలాపాలలో పనితీరులో ఒడిశా ఉత్తమ రాష్ట్రంగా ఈస్ట్ జోన్‌లో అవార్డు పొందిందని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ శనివారం తెలిపింది.

– భువనేశ్వర్

• పర్యావరణ పరిరక్షణకు..

గుమ్మాబ్లాక్ పద్మపురం గ్రామంలోని సంబాద్ సాహిత్య ఘర్ ఆధ్వర్యంలో 300 మొక్కలను విద్యార్థులు నాటారు. పద్మపురం యువ సంఘటన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంబాద్ ఒడియా పత్రిక తరపున వృక్షారోపణపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దేవగిరి రేంజ్ అధికారి బ్రహ్మానంద సాహు, ఉపాంత ప్రహరి పూర్ణచంద్ర మహాపాత్రో, గజపతి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు దేబాషిష్ పాడి, విశ్రాంత ఉపాధ్యాయులు టి.లక్ష్మణరావు, యస్.రుషి, సంబాద్ పత్రికా ప్రతినిధి శ్రీకాంత్ మహారాణా తదితరులు పాల్గొన్నారు.

– పర్లాకిమిడి



చల్లారని బడ్జెట్ సెగలు

- అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం
- మాది ప్రజా ప్రభుత్వం: బీజేపీ
- దూరదృష్టి లేని బడ్జెట్: బీజేడీ



మాట్లాడుతున్న సమీర్ మహంతి



మాట్లాడుతున్న శ్రీలేఖ సామంత సింగార్

భువనేశ్వర్: శాసన సభలో ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. రాష్ట్రంలో తొలిసారిగా పాలన పగ్గాలు చేపట్టిన బీజేపీ ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం 2 లక్షల 65 వేల కోట్ల రూపాయల పరిమాణపు బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌లో సమాజంలోని 4 వర్గాలకు పెద్దపీట వేశారు. పేదలు, మహిళలు, యువత, రైతు వర్గాలకు ప్రాధాన్యతతో నిధులు కేటాయించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నినాదం సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ ప్రేరణగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి కొత్త బడ్జెటుకు రూపురేఖలు దిద్దారు.

☛ ప్రజా బడ్జెట్ ఇది

గత 24 ఏళ్లలో బిజూ జనతా దళ్‌కు సాధ్యం కాని రీతిలో కొత్త ప్రభుత్వం ఈ బడ్జెటు రూపొందిందని బీజేపీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు 15 శాతం పెరిగాయన్నారు. బీజేపీ ప్రజల ప్రభుత్వం కావడంతో ప్రజా బడ్జెటు ప్రవేశ పెట్టిందన్నారు. రాష్ట్రంలో 65 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం వరి కనీస మద్దతు ధర రూ.3,100లకు పెంచిందని పేర్కొన్నారు. సరికొత్తగా ముఖ్యమంత్రి కిషాన్ యోజన, శ్రీఅన్న అభియాన్ కార్యక్రమాలను ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. దాదాపు రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ పాలన చేసిన బీజేడీ హయాంలో సాధ్యం కాని స్వయం సమృద్ధి ఒడిషా ఆవిష్కరణ ఈ బడ్జెటు లక్ష్యంగా పేర్కొన్నారు. బీజేడీ మహిళలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుని బూటకపు ప్రకటనలతో మోసగించిందని ఆరోపించారు. మహిళా సాధికారత కోసం బీజేపీ ప్రభుత్వం 'సుభద్ర' పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. రానున్న రోజుల్లో 25 లక్షల మంది మహిళలకు 'లక్షపతి దీదీ'గా చేసి ఉపాధి కల్పిస్తుందన్నారు. దివ్యాంగులు, వయో వృద్ధుల పింఛన్లు గణనీయంగా పెంచినట్లు తెలిపారు. దాదాపు 5,26,833 మంది దీనిద్వారా ప్రయోజనం పొందనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి పెద్ద పీట వేయడం విశేషంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర బడ్జెటులో ప్రాధాన్యత కల్పించినట్లు వెల్లడించారు.

☛ సామాజిక వ్యతిరేక బడ్జెట్

రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సభలో ప్రవేశపెట్టిన ఈ ఏడాది బడ్జెటు దూరదృష్టి లేనిదని, దీంతో పురోగతి 2 అడుగుల వెనుకకు వెళ్తుందని బిజూ జనతా దళ్ అధికార ప్రతినిధి డాక్టర్ లేఖశ్రీ సామంత సింఘార్ మండిపడ్డారు. రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల వృద్ధితో లక్ష్యాన్ని నవీన్ పట్నాయక్ సంకల్పించినట్లు ఆమె గుర్తు చేశారు. రాష్ట్రంలో తలసరి రుణ భారం జాతీయ స్థాయిలో అతి తక్కువగా ఉండేదని, అయితే కొత్త బడ్జెటు ప్రభావంతో ఈ పరిస్థితి తలకిందులయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. మహిళ, రైతు, యువజన వ్యతిరేక బడ్జెట్‌గా వ్యాఖ్యానించారు. సుభద్రా యోజన ముసుగులో మహిళలను మభ్యపరిచే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం తలమునకలై ఉందన్నారు. ఈ పథకం కింద అత్యధిక మహిళలు లబ్ధి పొందలేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో సాంఘిక భద్రత కింద అర్హులందరికీ రూ.3,000 చొప్పున ఫించను కలిపిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వయో, దివ్యాంగ పరిమితుల ఆంక్షలతో అత్యధికులకు మొండిచేయి చూపడం విచారకరం అన్నారు. నామమాత్రంగా అతి తక్కువ మందికి బడ్జెటులో ప్రకటించిన పింఛన్ లబ్ధి అనుకూలిస్తుందన్నారు.

వికసిత్ ఒడిశా మా లక్ష్యం

- సీఎం మోహన్ చరణ్ మాఝి



భువనేశ్వర్: న్యూఢిల్లీలో శనివారం జరిగిన నీతి అయోగ్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పలు డిమాండ్లను తెలిపారు. వికసిత్ భారత్ – 2047 ప్రతి భారతీయుడి ఆశయం. రాష్ట్రాలు ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించడంలో చురుకైన పాత్ర పోషించాలని నీతి అయోగ్ 9వ పాలక మండలి సమావేశంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ పిలుపుపై రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి స్పందిస్తూ.. భారత ప్రభుత్వం సహాయ సహకారాలతో వికసిత్ ఒడిశా లక్ష్య సాధనకు కృషి చేస్తామన్నారు. ఒడిశా స్థిరమైన వార్షిక వృద్ధి 8 నుంచి 10 శాతం లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ కృషితో ఒడిశా మధ్య స్థాయి రాష్ట్రం నుంచి భారతదేశ అభివృద్ధి రైలులో మొదటి బోగీలలో ఒకటిగా నిలుస్తుందన్నారు.

☛ రాష్ట్రానికి బదిలీ చేయాలి

సమావేశంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మాట్లాడుతూ గంజాం జిల్లాలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన సుమారు 4,300 ఎకరాల ఉప్పు కయ్య (సాల్ట్ ప్యాన్) భూమిని రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరారు. జాతీయ సగటుతో పోలిస్తే ఒడిశా తక్కువ రైల్వే సాంద్రతను కలిగి ఉందన్నారు. ఒడిశాలో రైల్వే సాంద్రతను పెంచడాన్ని భారత ప్రభుత్వం పరిగణించాలని ప్రస్తావించారు. 2036వ సంవత్సరానికి ఒడిశా రాష్ట్రంగా ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో రానున్న దశాబ్దం అత్యంత కీలకమని పేర్కొన్నారు. 2036 నాటికి వికసిత్ ఒడిశా కలలను సాకారం చేసేందుకు అధిక వృద్ధిని ప్రేరేపించే వ్యూహంపై పని చేయడం ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం ఒడిశాలోని ధామ్రా మరియు గోపాల్‌పూర్ ఓడ రేవుల పరిసర ప్రాంతాల్లో భారీస్థాయి ఓడరేవు ఆధారిత పారిశ్రామిక జోన్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు అవసరమని పేర్కొన్నారు.

☛ గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను అభివృద్ధి చేయాలి

అస్తరంగ్, పాలూర్, బహుదా, సువర్ణ రేఖ వద్ద నున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని సీఎం తెలిపారు. ఒడిశా విపత్తు నిర్వహణలో అగ్రగామిగా అవతరించింది. ఈ రంగంలో విశేషమైన స్థితిస్థాపకతను ప్రదర్శిస్తుంది. విద్యుత్, టెలికాం రంగాలు మరియు తీర ప్రాంత విపత్తు తట్టుకునే మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అవసరమని తెలిపారు. పారిశ్రామిక పార్కులు మరియు కారిడార్లు, ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌లు, రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెరుగైన ఎయిర్ కనెక్టివిటీ వంటి వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, త్వరిత క్లియరెన్స్‌లను కేంద్ర ప్రభుత్వం నుంచి కోరారు. ఒడిశా ఖనిజ వనరులతో సమృద్ధిగా ఉందని, దేశంలోని వివిధ ఖనిజాల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉందని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సూచించారు. వీటి ప్రాముఖ్యత పెంపొందించేందుకు ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో అవసరాలకు అనుగుణంగా వినియోగించే చర్యలను చేపట్టాలని ప్రతిపాదించారు.

బడ్జెట్‌తో 'వికసిత భారత్'



వేదికపై బబిలత షరప్, దాస్, సాయి మాధవ్ తదితరులు

రాయగడ: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత భారత్ వైపు అడుగులు వేసేవిధంగా ఉందని వక్తలు పేర్కొన్నారు. స్థానిక అటానమస్ కళాశాలలో కేంద్ర బడ్జెట్‌పై వక్తల సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా ఎకనామిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవినారాయణ్ పాత్రో, కార్యవర్గ సభ్యుడు సంహోల్ మిశ్రా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ రీసెర్చ్ (భువనేశ్వర్) అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అమరేంద్ర దాస్ తదితరులు బడ్జెట్‌పై సుదీర్ఘంగా చర్చించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు గ్రీన్ ఎనర్జీ పన్నుల వసూళ్లపై దృష్టి సారించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా రాష్ట్ర బడ్జెట్ ఆర్థిక పురోగతికి నాంది పలికేవిధంగా రూపుదిద్దుకోవడం హర్షించదగ్గ విషయమని అమరేంద్ర దాస్ అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమం, ఉపాధి కల్పన, ఉపాధి శిక్షణ వంటి వాటిపై దృష్టి సారించిందని, దీంతో భారత్ 2047 నాటికి వికసిత్ భారత్‌గా మారే అవకాశం పుష్కలంగా కనిపిస్తోందన్నారు. ఆర్థికాభివృద్ధిలో దేశంలోనే 4వ స్థానానికి మన రాష్ట్రం చేరుకుందన్నారు. రెండు బడ్జెట్లలో సమగ్రాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత కల్పించడం ఆహ్వానించదగ్గదేనని సింహాచల్ మిశ్రా అభిప్రాయం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ బబిలత షరప్ అధ్యక్షతన జరిగిన సదస్సులో అర్థశాస్త్ర విభాగాధిపతి వైవీ సాయి మాధవ్, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి సుబ్రత్ కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

'విజ్ఞాన ప్రదర్శనలతో మానసిక వికాసం'



ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

జయపురం:

విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల మానసిక వికాసానికి దోహదపడతాయని హయ్యర్ ఎడ్యుకేషన్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ గోపాల హల్దార్ అన్నారు. సమితిలోని ఫూల్‌బెడ విజ్ఞాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇంటర్ లెవెల్ సైన్స్ ఎగ్జిబిషన్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రపంచంతో పోటీ పడాలంటే విజ్ఞాన సముపార్జనలో విద్యార్థులు ముందంజలో ఉండాలన్నారు. విద్యార్థుల ప్రాజెక్టులు వారి ప్రతిభను చాటుతున్నాయని అభినందించారు. స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ దేవీ ప్రసాద్ మిశ్ర మాట్లాడుతూ.. సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రధాన మార్గదర్శకాలను వివరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల అధ్యక్షుడు ప్రకాశ్ కుమార్ నాయిక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విక్రమ్ దేవ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా.సుజిత్ దెహురి, డా.బ్రజబందు నందో, జ్ఞానరంజన్ మహంతి, కొరాపుట్ కళాశాల డా.సునీల్ ఘడనాయిక్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు డా.ప్రదీప్ మిశ్ర, డా.దుర్గా ప్రసాద్ పాణిగ్రహి, విశ్రాంత విద్యాధికారి సురేంద్ర పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు ప్రదర్శిస్తున్న విద్యార్థిని



బహుమతులతో విజేతలైన విద్యార్థులు



పరిశ్రమపై అవగాహన కల్గించే ప్రాజెక్టు



వ్యవసాయంపై ప్రాజెక్టు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

అమరవీరుల స్మరణ మన కర్తవ్యం


భువనేశ్వర్: నగరంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: కార్గిల్ యుద్ధంలో అమరులైన వారిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ అన్నారు. కార్గిల్ విజయోత్సవాలను పురస్కరించుకొని బీజేపీ యువమోర్చ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ శనివారం నిర్వహించారు. అనంతరం బిజూ పటా్నయక్ అడిటోరియంలో జనసభ పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ పాలనలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ ఎస్సీ, ఎస్టీ మోర్చ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి, రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యుడు బసంత కుమార్ ఉలక, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు టుటు దాస్, యువ మోర్చ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నీలాద్రి బిహరి పాత్రో తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ కాశీనగర్ నగర పంచాయతీలో కార్గిల్ అమరవీరులకు నివాళులర్పిస్తూ బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు బాలకృష్ణ పాత్రో, ఉపాధ్యక్షుడు బబునా బెహరా, జిల్లా సాధారణ కార్యదర్శి ఈ.ప్రశాంత్, జగన్నాథ మహాపాత్రో, కాశీనగర్ ఎన్ఏసీ మండల అధ్యక్షుడు వి.చలపతి, మాజీ సైనికుడు ఎన్.రవణయ్య తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వర్: కార్గిల్ యుద్ధంలో విజయం సాధించడం భారతదేశ చరిత్రలో మరచిపోలేని రోజు. దీంతో కార్గిల్ వీర జవాన్ల స్మారకార్థం పట్టణంలో శనివారం బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో భారీ త్రిరంగ పతాక ర్యాలీ నిర్వహించింది. 1000 మీటర్ల పొడవున్న త్రివర్ణ జాతీయ పతాకంతో 3 వేల మందికి పైగా విద్యార్థులు, యువకులు, మహిళలు స్థానిక మాస్టర్ క్యాంటిన్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, ఎమ్మెల్యేలు బాబు సింగ్, ఇరాశిష్ ఆచార్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక లింగరాజ మందిరం సమీపంలో ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కార్గిల్ దినోత్సవం, త్రిరంగ యాత్రలను యావత్ భారతావనిలో ఘనంగా నిర్వహించామన్నారు.


పర్లాకిమిడి: కాశీనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


రాయగడ: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శివపట్నాయక్ తదితరులు


రాయగడ: విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న యువత


రాయగడ: జనసభలో పాల్గొన్న కార్యకర్తలు

క్లుప్తంగా

3న పౌరాణిక ఏకపాత్రాభినయ ప్రదర్శనలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 3న బాపూజీ కళామందిర్‌లో పౌరాణిక ఏకపాత్రాభినయ ప్రదర్శనలు జరుగుతాయని నిర్వాహకులు చిట్టి వెంకటరావు, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, ఇంజరాపు రమణారావు, రామచంద్రదేవ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో శ్రీకృష్ణ, ఆంజనేయ, అర్జున, కర్ణుడు, నక్షత్రక, విశ్వామిత్ర, హరిద్వజుడు, హరిశ్చంద్ర, చంద్రమతి తదితర 30 రకాల పౌరాణిక ఏక పాత్రలు ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచే ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం జరిగే సభలో బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. ఔత్సాహికులు ఈ ప్రదర్శనలను చూసేందుకు రావలసిందిగా కోరారు.

ఇసుక లారీ పట్టివేత


పట్టుబడిన లారీ

శ్రీకాకుళం రూరల్: మండలంలోని బట్టేరు పరిసర ప్రాంతంలో లారీలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను శనివారం రెవెన్యూ అధికారులు పట్టుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. తొలుత ఇసుకను డంపింగ్ చేసిన లారీ యజమానులు పొన్నాం పరిసర ప్రాంతం గుండా ఆమదాలవలస మీదుగా తరలించేందుకు పూనుకున్నారు. అటువైపు వెళ్తున్న రెవెన్యూ అధికారులు వెంబడించి లారీను పట్టుకున్నారు. ఈ దాడుల్లో వీఆర్వోలు గణేష్, యశ్వంత్, లక్ష్మణ, రవితేజ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎఫ్ఓ


కలెక్టర్‌తో మాట్లాడుతున్న అటవీ అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను జిల్లా అటవీ శాఖ అధికారి శంబంగి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా డీఎఫ్ఓ జి.ఎ.పి.ప్రసూన, టెక్కలి సబ్ డీఎఫ్ఓ ఎ.వి.నాగేంద్రరావు, పాలకొండ సబ్ డీఎఫ్ఓ సంజయ్, రేంజర్లు పి.అమ్మన్నాయుడు, జి.జగదీశ్వరరావు, కె.రాజశేఖర్, నిహారిక, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

జీఓ 53 మేరకు టీచర్లను నియమించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జీఓ 117 రద్దుచేసి జీవో ఎంఎస్ నంబర్ 53 ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని, ఒకటి నుంచి ఐదు తరగతులతను ఒకే పాఠశాలగా నడపాలని యూటీఎఫ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానం అమలు చేయాలన్నారు. హైస్కూల్స్‌లో రెండు మాధ్యమాలను సమాంతరంగా కొనసాగించాలని కోరారు. హైస్కూల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, కిలోమీటర్ పైబడి దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని విన్నవించారు. కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని కోరారు.

నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన క్రిమినల్ చట్టాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసులు మరింత అవగాహన పెంచుకుని న్యాయవ్యవస్థ, బాధితులకు తోడ్పాటును అందించాలని ఏపీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరి రామకోటేశ్వరరావు సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టుల పోలీస్ లైజనింగ్ ఆఫీసర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలక్ష ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి ప్రారంభమైన నూతన క్రిమినల్ చట్టాలపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ అజయ్ లాం, సుబ్బలక్ష్మి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం పీపీ మెట్ట మల్లేశ్వరరావు, వివిధ కోర్టుల పీపీలు వాన కృష్ణచంద్, తంగి శివప్రసాదరావు, కోత తిరుమలరావు, సీహెచ్ శ్రీకాంత్, కె.శంకరరావు, సీహెచ్ సత్యనారాయణ, ఎల్.వి.రమణ, పి.ఉషాసింగ్, ఉషారాణి, పి.సుశీల, ఎల్.నాగభూషణరావు, కె.సూర్యకుమార్, ఎల్.రఘునాథ్, ప్రియదర్శిని ఆర్.శాంతిసంతోషి, జి.విజయలక్ష్మి, డి.హరిప్రియ, రమేష్, జిల్లా కోర్టు పోలీస్ లైజన్ ఎస్ఐ జి.నాగమణి, అదనపు ఎస్ఐలు పాల్గొన్నారు.

వీడని వాన


జాతీయ రహదారిలో పారుతున్న వర్షపు నీరు


జయపురంలో ప్రధాన రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

జయపురం: డివిజన్ పరిధిలో గత మూడు వారాలుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనేక ఇళ్లు, పాఠశాలల్లోకి వర్షపు నీరు చేరింది. పలుచోట్ల రోడ్లు, చెరువులకు గండ్లు పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


ఉమ్మిరివద్ద గండిపడిన దృశ్యం


ఒక ఇంట్లోకి వెళ్తున్న వర్షపు నీరు


కుంద్రా కొండ వాగులో ఉధృతంగా వరద

మల్కన్‌గిరిలో డయేరియా విజృంభణ


చికిత్స పొందుతున్న మహిళలు


చికిత్స పొందుతున్న యువకుడు


మహిళకు చికిత్స అందజేస్తున్న వైద్యుడు ప్రఫుల్ల కుమార్ బెహర

మల్కన్‌గిరి: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గత 5 రోజుల్లో 60 మంది డయేరియాతో చికిత్స కోసం చేరారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలో గత 10 రోజులుగా విపరీతంగా వర్షాలు కురిశాయి. దీంతో తాగునీరు కలుషితమై పలు గ్రామాల ప్రజలు డయేరియా బారిన పడ్డారు. వీరంతా చికిత్స కోసం ఆస్పత్రిలో చేరుతున్నట్లు డా.ప్రపుల్ల కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. వార్డుల్లో మంచాలు తక్కువగా ఉండడంతో కొంతమందిని నేలపైనే ఉంచి వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. డయేరియా నుంచి కాపాడుకోవడానికి ప్రజలు వేడినీరు, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చారు.

విరిగిపడిన కొండ చరియలు


రహదారిలో పడిన మట్టిని తొలగిస్తున్న దృశ్యం


కొట్టుకుపోయిన రహదారి పరిశీలిస్తున్న అధికారులు


కొండ చరియల మట్టితో కప్పబడిన రహదారి


- 18 గ్రామాలకు రాకపోకలు బంద్

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి నక్కమాముడి పంచాయతీ బయపోడ ఘాటీలో మరోసారి భారీ వర్షాలకు శనివారం కొండ చరియాలు విరిగి పడ్డాయి. దీంతో సుమారు 18 గ్రామాలకు రోకపోకలు నిలిచిపోయాయి. ఈ జిల్లాలో గత 10 రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఇటీవల ఈనెల 20వ తేదీన కొండ చరియలు విరిగిపడడంతో అధికారులు రహదారి క్లియర్ చేశారు. అయితే శనివారం మరోసారి విరిగిపడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అధికారులు జేసీబీలతో మట్టి తొలగిస్తున్నారు.


కొండపై నుంచి పడుతున్న వరద నీరు


కొండల నుంచి వస్తున్న వరద నీరు

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


రమేష్(ఫైల్)

రణస్థలం: మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలస గ్రామానికి చెందిన ధర్మాన రమేష్ (23) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మాన రమేష్ కుటుంబ గొడవల నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయారు. సాయింత్రం 5 గంటల సమయంలో సీతంవలస కొండ సమీపంలోని తోటలో చెట్టుకు ఉరివేసుకుని రమేష్ చనిపోయి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శ్రీకాకుళం శవ పంచనామాకు తరలించారు. మృతుడు రణస్థలంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. తండ్రి ఈశ్వరరావు, తల్లి రామలక్ష్మి, సోదరుడు నరేష్ ఉన్నారు. వివాహేతర సంబంధమే ఆత్మహత్యకు కారణమని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ను శనివారం వీఆర్వోల సంఘం ప్రతినిధులు గౌరవపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మూడున్నరేళ్లుగా పదోన్నతులు లేవని, వెంటనే కల్పించేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు వంజరాపు రమేష్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, గౌరవాధ్యక్షుడు ప్రగడ వేణుగోపాలరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ వీఆర్ఎల్ శాస్త్రి, కో -ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుందరతిరువాడలో ఏనుగులు



అరటి తోట నుంచి బయటకు వస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని కుందరతిరువాడ పంట పొలాలలో ఉన్న ఏనుగులు శనివారం మధ్యాహ్నం అరటితోటలో దర్శనమిచ్చాయి. అరటి, పామాయిల్ తోటలలోనే కాకుండా చెరకు తోటలో ఏనుగులు ఉన్నాయి. చెరకు తోటను పూర్తిగా ధ్వంసం చేయడంతో పాటు అరటి తోటను ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం ఉబాలు జరుగుతుండడంతో వరినారు ధ్వంసం చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖాధికారులను రైతులు కోరుతున్నారు.

ఇన్‌స్పైర్ నామినేషన్ ప్రక్రియ ప్రారంభం

పార్వతీపురం టౌన్: ఇన్‌స్పైర్ నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా విద్యా శాఖ అధికారిణి జి.పగడాలమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గల అన్ని మండలాల విద్యా శాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు మేనేజ్‌మెంట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నామినేషన్‌లు వేసేలా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. 2024 - 25 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మంక్ నామినేషన్‌లకు ఆన్‌లైన్‌లో ప్రతీ ఉన్నత పాఠశాల నుండి ఐదు ప్రాజెక్ట్స్, ప్రాథమికోన్నత పాఠశాలల నుండి 3 ప్రాజెక్టు తప్పనిసరిగా సమర్పించాలని ఆమె పేర్కొన్నారు. హెచ్‌టీటీపీఎ://డబ్లూడబ్లూడబ్లూ.ఇన్‌స్పైర్‌వార్డ్స్-డీఎస్‌టీ.ఇన్/ అనే లింక్ ద్వారా నామినేషన్ చేయాలని ఆమె ఆదేశించారు. వివరాలకు జిల్లా సైన్సు అధికారి లక్ష్మణరావు 8979077156ను సంప్రదించాలని ఆమె చెప్పారు.

ప్రమాద క్షతగాత్రుల్లో మరొకరు మృతి

డెంకాడ: మండలంలోని జొన్నాడ గ్రామంలో ఈ నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న చందక లక్ష్మణరావు(50) శనివారం ఉదయం మరణించినట్టు ఎస్ఐ ఎం.కృష్ణమూర్తి తెలిపారు. జొన్నాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే రోజే ఇద్దరు మరణించగా, పది మందికి గాయాలైన విషయం పాఠకులకు విదితమే. తీవ్రంగా గాయపడి విజయనగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొద్దవలస గ్రామానికి చెందిన చందక లక్ష్మణరావు శనివారం మరణించాడు.

హోంగార్డు పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

విజయనగరం క్రైమ్: ఉన్నత విద్య అభ్యసించేందుకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని హోంగార్డ్స్ ఆర్ఐ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. హోంగార్డ్‌ల సంక్షేమంలో భాగంగా టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో మెరిట్ స్కాలర్‌షిప్‌లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యంతో చదివి మంచి మార్కులు సంపాదించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు ప్రభాకరరావు, హోంగార్డులు, వారి పిల్లలు పాల్గొన్నారు.

10 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో జీఆర్‌పీ సిబ్బంది

పార్వతీపురం టౌన్: పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో శనివారం 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు జీఆర్‌పీ లైన్ ఇన్‌స్పెక్టర్ ఒ.వెంకటరావు శనివారం తెలిపారు. పార్వతీపురం రైల్వేస్టేషన్ పరిధిలో ఫ్లాట్‌ఫామ్‌పై తనిఖీలు చేస్తుండగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బసంత్‌కుమార్ అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆయన నుంచి రూ.50 వేల విలువ గల 10 కేజీల గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాలను వెలికితీయడంలో విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ ప్రత్యేక టీంల సహాయంతో నిఘా వర్గాలను ఏర్పాటు చేశామన్నారు. విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, అరకు రైల్వేస్టేషన్ల పరిధిలో తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నట్లు తెలిపారు. జీఆర్‌పీ విజయనగరం ఎస్ఐ వి.రవివర్మ, హెచ్‌సీ రత్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యకళాశాల పోస్టుల భర్తీ రీ నోటిఫికేషన్ నిలుపుదల

విజయనగరం ఫోర్ట్: గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌తో ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో పోస్టుల భర్తీ దాదాపు పూర్తయింది. కొన్ని పోస్టులకు తుది జాబితాలు కూడా విడుదల చేశారు. అయితే, రాజకీయ ఒత్తిడితో పాత నోటిఫికేషన్ రద్దుచేసి మరలా నోటిఫికేషన్ ఇవ్వడంపై 'నిరుద్యోగులతో ఆటలు!' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి వైద్యకళాశాల అధికారులు స్పందించారు. జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులు-26, సపోర్టింగ్ స్టాప్-56 పోస్టులకు గురువారం ఇచ్చిన నోటిఫికేషన్‌ను వైద్య విద్యా సంచాలకుల ఆదేశాల ప్రకారం నిలుపుదల చేస్తున్నట్టు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు.

'వీవీఎం'తో మేధోసంపత్తి

- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' పోటీ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 15 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు
- 6 నుంచి 11వ తరగతి వరకు రెండు విభాగాల్లో పోటీ పరీక్ష
- పాఠశాల, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలు
- ఎంపికైతే స్కాలర్‌షిప్, ప్రఖ్యాతి పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్
- అధిక సంఖ్యలో పాల్గొనేలా హెచ్ఎంలు కృషి చేయాలి : డీఈఓ



వీవీఎం లోగోతో పోటీ పరీక్ష ప్రచార పోస్టర్

విజయనగరం అర్బన్: విద్యార్థులు పరిశోధనా దృక్పథాన్ని మెరుగుపరిచి ప్రయోగాల్లో రాణించేలా కేంద్ర ప్రభుత్వం 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' (వీవీఎం) పేరుతో ఏటా జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ్ పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన్ ప్రసాద్, విజ్ఞాన్ భారతి సంయుక్తంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఇందులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు భారత దేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుంది.

ప్రస్తుతం 2024 - 25 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరు నుంచి ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులకు స్టేట్ బోర్డు, సీబీఎస్ఈ, ఎన్‌సీఈఆర్టీ వారికీ ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారు భారత దేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం అంటుంది.

రెండు విభాగాల్లో పరీక్ష

ఈ పరీక్ష రెండు విభాగాల్లో నిర్వహిస్తారు. 6 నుంచి 11వ తరగతి వరకు చదివే విద్యార్థులకు రెండు విభాగాలుంటాయి. 6 - 8 తరగతుల విద్యార్థులకు జూనియర్ విభాగంగా, 9 - 11 తరగతుల విద్యార్థులను సీనియర్ విభాగంగా వేరు చేసి పరీక్ష పెడతారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ తదితర భారతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. తొలుత పాఠశాల స్థాయిలో ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 20 మందిని ఎంపిక చేస్తారు. ఈ లెక్కన 6 నుంచి 11వ తరగతుల నుంచి మొత్తం 120 మందిని ఎంపిక చేస్తారు. పాఠశాల స్థాయిలో వచ్చే అక్టోబర్ 23, 27 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. ఒక విద్యార్థి ఒకసారి మాత్రమే లాగిన్ అవ్వొచ్చు. అందులో తరగతికి ముగ్గురు వంతున ప్రతిభ చూపిన మొత్తం 18 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి పరీక్ష నవంబర్ 26 లేదా డిసెంబర్ 3, 10, 17 తేదీల్లో ఏదో ఒక రోజు ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.5 వేలు, రూ.2 వేలు నగదుతో పాటు, ప్రశంసాపత్రం అందజేస్తారు.

జాతీయ స్థాయి విజేతకు రూ.25 వేల బహుమతి

ఈ పోటీ పరీక్షలో జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2023-24 జాతీయ, జోనల్ స్థాయి విజేతులుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీఓ, ఇస్రో, సీఎస్ఐఆర్ వంటి ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1 నుంచి 3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ ప్రొగ్రాం కింద ఏడాది పాటు నెలకు రూ.2 వేలు ఉపకార వేతనంగా అందజేస్తారు.

సెప్టెంబర్ 15 వరకు గడువు

ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.200 రుసుం చెల్లించి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ ఏడాది మే 19న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. సెప్టెంబర్ 15న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుంది. పాఠశాల స్థాయిలో ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాలలో ఏదైనా ఒక దాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఇప్పటికే వెబ్‌సైట్‌లో పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు పరీక్ష

నమూనా పరీక్ష అక్టోబర్ 10న నిర్వహిస్తారు. ప్రధాన పరీక్ష అక్టోబర్ 23 నుంచి 27 తేదీల్లో (ఏదో ఒక రోజు మాత్రమే) అబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య కాలంలో 90 నిమిషాల పాటు పరీక్ష రాయాల్సి ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున 100 మార్కులుంటాయి. సెక్షన్ - ఏలో విజ్ఞానశాస్త్ర రంగంలో భారతీయ మేధావులు కృషి 20, శాంతి స్వరూప్ భట్నాగర్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్-బీలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50, థింకింగ్, రీజనింగ్ నుంచి 10 ప్రశ్నలుంటాయి.

అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా..



విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు దోహదపడే ఇలాంటి పోటీ పరీక్షల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. ఈ పరీక్ష ప్రతిభ చూపితే కలిగే ప్రయోజనాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించి సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కల్పించాలి.

-ఎస్.ప్రేమకుమార్, డీఈఓ

డిపార్టుమెంట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- డీఆర్‌ఓ అనిత



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ అనిత

విజయనగరం అర్బన్: డిపార్టుమెంట్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జరగనున్నందున ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఆర్‌ఓ ఎస్.డి.అనిత తెలిపారు. జిల్లాలో గాజులరేగలోనున్న సీతం కళాశాల, అయాన్ డిజిటల్ జోన్ కేంద్రాలుగా ఈ పరీక్షలు జరుగుతాయని ఆమె తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు రెండు పూటలా పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత సరఫరా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేలా పోలీస్ వారు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆన్లైన్ పరీక్షలు అయినందున ఆయా కేంద్రాల సిబ్బంది తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఐడీ ప్రూఫ్ ఒరిజినల్ తీసుకొని ఉదయం సెషన్ వారు 9.30 లోగా, మధాహ్నం సెషన్ వారు 2.30లోగా కేంద్రానికి వెళ్లాలని తెలిపారు. సమావేశంలో ఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, పోలీస్, వైద్య తదితర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

పశువులశాలలకు నిప్పపెట్టిన దుండగులు

- రెండు ఆవులు, దూడ మృతి



వసంత గ్రామంలో కాలిపోయిన పశువులశాల, మరణించిన ఆవులు

గంట్యాడ: పశువులశాలలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రెండు ఆవులు, ఒక దూడ మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని వసంత గ్రామంలో చలుమూరి రామారావు, వసంత బంగారయ్యకు చెందిన పశువుల శాలలు కొత్తూరు వెళ్లే మార్గంలో గ్రామానికి దూరంగా ఉన్నాయి. శుక్రవారం రాత్రి ఈ పశువుల శాలలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో పశువుల శాలలతో పాటు రెండు ఆవులు, ఒక దూడ చనిపోయాయి. మరో ఒక ఆవు పాక్షికంగా కాలిపోయింది. గడ్డివాము దగ్ధం అయింది. సమాచారం అందుకున్న వీఆర్‌ఓ రాధాకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సుమారు రూ.3లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు.

హిట్ అండ్ రన్ బాధితులకు న్యాయం

విజయనగరం క్రైమ్: గుర్తు తెలియని వాహనాలు ఢీకొనడం వల్ల మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేస్తామని ట్రాఫిక్ డీఎస్పీ, నోడల్ అధికారి డి. విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో జూలై 30న ఉదయం 11 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లా న్యాయసేవా సంస్థ ఆదేశాలతో బాధితులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇందులో భాగంగా హిట్ అండ్ రన్ కేసుల్లో మరణించిన బాధిత కుటుంబానికి రూ. 2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వ్యక్తులకు రూ. 50 వేలు చొప్పున నష్టపరిహారంగా ఇవ్వనున్నామన్నారు. అవగాహన కార్యక్రమంలో బాధిత కుటుంబాలు పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాజాం సిటీ: మండల పరిధిలోని బొద్దాం నుంచి సోపేరు వైపు వెళ్లే దారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సోపేరు గ్రామానికి చెందిన ఇద్దరు గాయపడ్డారని ఏఎస్ఐ జనార్ధనరావు తెలిపారు. సోపేరు నుంచి బొద్దాం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న వాడపల్లి సత్యనారాయణ, రమణను సోపేరు వైపు వెళ్తున్న వ్యాన్ ఢీకొనడంతో ఇరువురికి కాలు, మెడ భాగాలపై గాయాలయ్యాయని తెలిపారు. వెంటనే స్థానికులు సహాయంతో రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

వరినాట్లలో మెలకువలు పాటించాలి

- జిల్లా వ్యవసాయ వనరుల సమన్వయకర్త శ్రీనివాస్



అంటిపేటలో విత్తనోత్పత్తి పొలంలో నాట్లు వేయడంపై రైతులకు అవగాహన

సీతానగరం: ఖరీఫ్ సీజనులో సమయంలో రైతులు వరినాట్లు వేయడంలో, ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల సమన్వయకర్త ఆర్.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అంటిపేట - లక్ష్మీపురం గ్రామాల్లో గ్రామ విత్తనోత్పత్తి చేయనున్న పొలాల్లో రైతులు వేస్తున్న వరినాట్లు విధానంపై శిక్షణ కార్యక్రమాన్ని ఆయనతో పాటు వ్యవసాయ శాఖ ఏడీలు భారతి, శారద శనివారం పరిశీలించారు. వరినాట్లు వేసే ముందు వ్యవసాయ శాఖ అధికారుల సహకారం, సూచనలు పాటిస్తూ నాట్లు వేయాలన్నారు. యాజమాన్య పద్ధతులను వివరించారు. మొక్క మొక్కకు మధ్య తగు దూరం ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. నాట్లు వేసే సమయంలో రెండు సెంటీమీటర్లు కంటే తక్కువ నీరు ఉండే విధంగా చూసు కోవాలన్నారు. ప్రతి కుదురుకు రెండు లేదా మూడు మొనలు ఉండే విధంగా నాట్లు వేసుకోవాలన్నారు. ఒకే పాటుగా 50 కేజీలు డీఏపీ, 10 కేజీల యూరియా, 10 కేజీల పొటాషియం కలిపి పొలంలో నాట్లకు ముందు వేసుకున్నట్లయితే ఎరువు వినియోగం బాగా పెరుగుతుందన్నారు. ఏఓ అవినాష్, వ్యవసాయ శాఖ సహాయకులు లావణ్య, వినయ్,, రైతులు పి.నాగభూషణరావు, అప్పలనాయుడు, జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానంలో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్టేనని సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్‌రాజు అన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్‌లో శనివారం మెగా రక్తదాన శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయాలలో రక్తం దొరకక ప్రాణాలు పోగొట్టుకున్న వారు ఎందరో ఉన్నారన్నారు. రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలు నిలబెట్టిన వారమవుతామన్నారు. వైస్ చాన్సరల్ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి మాట్లాడుతూ యువత రక్తదానం చేయడం వల్ల వారిలో కొత్త రక్తం తయారవవుతుందని అన్నారు. అనంతరం శిబిరంలో రక్తదానం చేసిన సెంచూరియన్ యూనివర్సిటీ విద్యార్థులు 60 మంది ధ్రువపత్రాలను అందజేసారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ మహేశ్, యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ చైతన్య, రోటరీ క్లబ్ అధ్యక్షుడు జి.వినోద్‌కుమార్, కార్యదర్శి డి.నాగప్రకాశ్, కోశాధికారి ప్రవీణ్‌కుమార్ అంచాలియా, డి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

మన క్రీడాకారులు ఒలింపిక్స్‌లో విజయాలు సాధించాలి

- కలెక్టరేట్‌లో సెల్ఫీ పాయింట్ ప్రారంభించిన కలెక్టర్



సెల్ఫీ పాయింట్‌లో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: మన దేశం తరపున పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న క్రీడాకారులంతా తమ తమ క్రీడాంశాల్లో పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ భారతీయులంతా సందేశాలు పంపించి వారికి మద్దతుగా నిలవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఒలింపిక్స్ క్రీడాకారులకు మద్దతుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీర్ ఫర్ భారత్ పేరుతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను సాయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం తరపున 16 క్రీడాంశాల్లో 117 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని వారంతా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశానికి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ గత ఒలింపిక్స్‌లో మన క్రీడాకారులు ఒక స్వర్ణం, రెండు రజతాలు సహా ఏడు పతకాలు సాధించారని ఈ ఏడాది మరిన్ని పతకాలు సాధించి దేశ కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని కోరారు. క్రీడలను ప్రోత్సహించడం, క్రీడల పట్ల యువతలో ఆసక్తి నెలకొల్పడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంకల్పం ఉంటే విజయం దాసోహం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: లక్ష్యాన్ని సాధిస్తానన్న దృఢ సంకల్పం యువతకు ఉంటే విజయం దాసోహం అవుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. స్థానిక వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని స్టూడెంట్ సక్సెస్ సొసైటీ సౌజన్యంతో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించడం చాలా అవసరమన్నారు. అందులో భాగంగా జిల్లాలో గ్రామ విజ్ఞాన వికాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. యువతీ, యువకులు నిరంతర సాధన, విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరిలో మేధాశక్తి ఉంటుందని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే సాధించలేనిది ఉండదని యువతలో స్ఫూర్తిని, ప్రోత్సాహాన్ని నింపారు. ప్లానింగ్, ప్రెజెంటేషన్, ప్రిపరేషన్ విజయానికి సోపానాలని తెలిపారు. యువతకు ఎంచుకున్న రంగంలో సాధించాలన్న తపన, పట్టుదల ఉండాలని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు అవసరమైన కెరీర్ గైడెన్స్ పుస్తకాలను కలెక్టర్ అందజేశారు. అంతకు ముందు కళాశాల ఆవరణలో భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంతి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు, అసోసియేట్ ప్రొఫెసర్ డా. కె.శంకరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.నాగిరెడ్డి వెంకటస్వామినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డా. సీహెచ్ చలపతిరావు, లోకబంధు ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ టీఎస్ఎస్ కార్తీక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

- వ్యవసాయాధికారుల సమీక్షలో మంత్రి కె.శ్రీనివాసరావు
- రైతు సేవా కేంద్రాల్లో మిగిలిన ఎరువులను ప్రైవేటు వారికి ఇవ్వాలి
- కలెక్టర్ బీఆర్ అంబేద్కర్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ మంత్రి కె.శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ మంత్రి కె. శ్రీనివాసరావు వ్యవసాయ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్‌తో కలిసి వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో మంత్రి శనివారం సమీక్షించారు. ఎరువులు చిన్న, సన్నకారు రైతులకు అందేలా చూడాలన్నారు. ఈ మూడు నెలలు రైతుకు కీలకమని, రైతు వెంటే ఉంటూ వారికి అవసరమైన సాగు సూచనలు అందజేయాలన్నారు. మార్క్‌ఫెడ్‌లో బఫర్ స్టాక్ ఉండేలా చూడాలని, సోమవారం నాటికి అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అంతకు ముందు కలెక్టర్ మండలాల వారీగా ఎరువుల



హాజరైన అధికారులు

పరిస్థితిపై సమీక్షించారు. ఏ మేరకు ఎరువులు అవసరం ఉన్నది, ప్రస్తుతం ఎంత వరకు స్టాక్ ఉన్నది అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారి తారక రామారావు మాట్లాడుతూ శనివారం 800 టన్నులు, ఆదివారం 800 టన్నుల ఎరువులు రానున్నాయని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ ముందుగా రైతు సేవా కేంద్రాల్లో సరిపడా ఎరువులను స్టాక్ చేయాలని, మిగిలిన తర్వాతే ప్రైవేటు డీలర్లకు ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడతానని, ఆర్.ఎస్.కే లలో ఇండెంట్ ప్రకారంగా స్టాక్‌లు ఉండాలన్నారు. మండలం వారీగా రైతులతో మాట్లాడడం జరుగుతుందని, ఎక్కడైనా ఎరువులు కొరత ఉందని తన దృష్టికి వస్తే సంబంధిత వ్యవసాయాధికారిదే బాధ్యత అని కలెక్టర్ హెచ్చరించారు. ఆగస్టు నెలాఖరుకు నాట్లు వేయడం పూర్తవుతుందని, ఈ లోపల వ్యవసాయ అధికారులంతా రైతులకు దగ్గరగా ఉంటూ తగు సలహాలను అందజేయాలని తెలిపారు. సమావేశంలో జేసీ కార్తీక్, ఉద్యానశాఖ అధికారి జమదగ్ని, మార్క్‌ఫెడ్ డీఎం విమల, ఏపీ సీడ్స్ డీఎం పద్మ, వ్యవసాయశాఖ ఏడీ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సిడ్బి ఆర్థిక అండ



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించిన సిడ్బి బృంద సభ్యులు

- ఎస్ఐడీబీఐ డీజీఎం సౌరబ్‌బాజపయ్
- దివ్యాంగులకు రూ.52 లక్షల26వేల విలువైన బడ్డీల పంపిణీ



బడ్డీను ప్రారంభిస్తున్న సిడ్బి డీజీఎం సౌరబ్‌బాజపయ్

కొత్తవలస: దివ్యాంగులు స్వయం సంపాదకులు కావాలని, ఆర్థికంగా ఎదిగేందుకు భారతీయ చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (ఎస్ఐడీబీఐ-సిడ్బి) కృషి చేస్తోందని ఆ సంస్థ డీజీఎం సౌరబ్‌బాజపయ్ అన్నారు. కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామ సమీపంలోని శ్రీ గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రూ.52లక్షల26వేలతో 50 మంది దివ్యాంగులకు కిరాణా, షెలూన్, ఇస్త్రీ, కూరగాయలు విక్రయం, చెప్పుల అమ్మకం, చెప్పులు కుట్టుకునేందుకు, పూల విక్రయానికి అనువైన బడ్డీలు, వీల్ ఛైర్స్, ట్రై సైకిల్స్ తదితర సామగ్రిని స్వావలంబన పథకంతో అందజేశారు. ఈ సందర్భంగా సౌరబ్‌బాజపయ్ మాట్లాడుతూ దివ్యాంగులు ఆర్థికంగా ఎదిగిన రోజు మరొకరిపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. అందుకు తగిన పూర్తిసహకారం సిడ్బి అందిస్తుందన్నారు. దివ్యాంగులు తమ వ్యాపారాన్ని మరింత వృద్ధి చేసుకునేందుకు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు కేవలం 50పైసల వడ్డీతో రుణాలను అందిస్తామన్నారు. గురుదేవా చారిటబుల్ ట్రస్టు దివ్యాంగుల పాలిట వరం అన్నారు. ట్రస్టు ఛైర్మన్ జగదీష్‌బాబు తన జీవితాన్ని దివ్యాంగుల సేవలకే అంకితం చేశారని కొనియాడారు. ట్రస్టు తరపున గత 23 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోని సుమారు లక్ష మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించడం గొప్పవిషయమన్నారు. అనంతరం పలువురు దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, 50 మంది వృద్ధులకు అవసరమైన రేషన్ అందజేశారు. కార్యక్రమంలో సిడ్బి అసోసియేట్ మేనేజర్ శ్రీష్టిఠాకుర్, హైవీ వాటర్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.సత్యకుమార్, మాజీ డీఎండీ వి.ఎస్.వి.రావ్ తదితరులు పాల్గొన్నారు.